క్లుప్తంగా

నేటి నుంచి సిటీ పోలీసు యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీసు యాక్టు అములలో ఉంటుందని సీపీ శ్వేత బుధవారం తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. డీజే వినియోగంపై ఉన్న నిబంధన ఈనెల 21 వరకు ఉంటుందని తెలిపారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

నంగునూరు(సిద్దిపేట): కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు పొందినవారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గీత బుధవారం సూచించారు. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రెండు రోజులుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్ తోపాటు ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్ అందజేయాలన్నారు.

చేర్యాల(సిద్దిపేట): కొత్త పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులు వెంటనే రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కడవేర్గు క్లస్టర్ రైతువేదికలో దరఖాస్తులు స్వీకరించారు. కడవేర్గు, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొమురవెల్లి(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తన అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



ముస్తాబవుతున్న దుర్గామాత ఆలయం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ నిర్మాణ కమిటీ తెలిపింది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా గురువారం వరుణ పూజ, గణపతి పూజ, 15న సుప్రభాత సేవ, మండపారాధన, 16న ఉదయం 8 గంటలకు సుప్రభాతం, సాయంత్రం బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. 17వ తేదీన దుర్గామాత అమ్మవారి కల్యాణోత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నంగునూరు(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తామని ఎంపీపీ అరుణాదేవి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

పాదుకా పూజ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, లక్ష్మీనగర్, ఆరెపల్లి గ్రామాల శివారు కూడలిలోని శ్రీ సదానందాశ్రమంలో బుధవారం పాదుకా పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు విశాల రాజపున్నయ్య శర్మ, రమేష్ నేతృత్వంలో భవానీ శంకర స్వామికి అభిషేకం, లింగార్చన, పుష్పార్చన, సామూహిక పూజలు చేశారు. కార్యక్రమంలో శిష్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలి

నర్సాపూర్ రూరల్: పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఆయా ప్రభుత్వ భూములతో పాటు సొంత స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే నోటీసులు ఇవ్వాలన్నారు. దీంతోపాటు ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలులో వేగం పెంచాలన్నారు. హరితహారం పథకంలో నాటిన చెట్లను సంరక్షించాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్, ఆయా వార్డుల అధికారులు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారుమడి తయారీలో ..

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- శీతాకాలంలో ప్రత్యేక దృష్టి సారించాలి
- సిద్దిపేట మండల వ్యవసాయాధికారి పర్శురాంరెడ్డి



వరి నారుమడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యాసంగి వరి సాగు చేసే రైతులు నారుమడుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటియాజమాన్యం పాటించాలని సిద్దిపేట మండల వ్యవసాయాధికారి పర్శురాంరెడ్డి సూచించారు. శీతాకాలంలో నారుమడుల తయారీలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్ప కాలిక రకాలను ఎంచుకోవాలన్నారు. అదేవిధంగా వడగండ్లు తదితర విపత్తుల నుంచి రక్షణకు స్వల్పకాలిక వంగడాలు ఎంచుకుంటే పంట త్వరగా వస్తుందన్నారు. ఈ దిశగా రైతులు ఎంటీయూ 1001, 110–120 రోజుల్లో చేతికందే వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

చలికాలంలో నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎకరానికి 30–35 కిలోల విత్తనం అవసరం.
- కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు.
- నిద్రావస్థలో ఉన్న విత్తనాలను కిలో విత్తనానికి 10 మి.లీ లీటరు నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి.
- పశువుల పేడగాని, సేంద్రియ ఎరువును ఎకరా నారుమడికి 100–200 కిలోలు వేయాలి.
- విత్తనాలు చల్లే ముందు ఎకరాకు 2 కిలోల నత్రజనిని, కిలో పోటాషియం చల్లాలి. విత్తనాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

జింక్ లోపం నివారణకు..

- చలి అధికమైనపుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది.
- అందువలన నారుమడిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మొలక కట్టిన విత్తానాన్ని నారుమడిలో మొదటి వారం రోజులపాటుగా తక్కువగా ఉంచాలి.
- రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు కంటే తక్కువగా ఉన్నపుడు నారు ఎదగదు, కొన్ని సార్లు వరి చనిపోతుంది. దీనికోసం రసాయన ఎరువులను వినియోగించాలి.
- చలి సమస్యను అధిగమించడానికి వరిమడులపై టార్పాలిన్ రాత్రి పూట ఉంచి ఉదయం తీసివేయాలి.
- రాత్రి వరిమడి నుంచి పూర్తిగా నీరు తీసివేసి ఉదయం తాజా నీటిని నింపాలి. దీంతో వరి ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటుంది.
- కాండం తొలిచే పురుగు(మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుటకు నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కొనలపై గుడ్లు పొదుగుతుంది. దీని వలన గుడ్లతో పాటుగా మొగ్గ పురుగును నివారించవచ్చు.
- నారు పీకే వారం రోజుల ముందు ఎకరా నారు మడికి కిలో కార్బోఫ్యూరో త్రీజీ లేదా కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 4జీ గుళికలను వేసుకుంటే నాటు వేసిన నెల వరకు ఎలాంటి కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోచ్చు.



పర్శురాంరెడ్డి, సిద్దిపేట ఏఓ

మంత్రికి ఘనస్వాగతం



బెజ్జంకి క్రాసింగ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, సత్యంను సన్మానిస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర రవాణ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తొలిసారి కరీంనగర్ జిల్లాకు వెళ్తున్న క్రమంలో బుధవారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపెల్లి సత్యనారాయణ, సత్యంను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కలిశారు. దుబ్బాక నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రికి వివరించి, నియోజకవర్గంలో పర్యటించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషిచేస్తానని హామీఇచ్చారు. అనంతరం మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ కార్యదర్శి తిరుపతి, సేవాదళ్ అధ్యక్షుడు కిష్టారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, మాజీ ఎంపీటీసీ మహిపాల్‌రెడ్డి, నాయకుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మండలంలోని శనిగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

రాయపోలు(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను నమ్మొద్దని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. రాయపోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీటీమ్ ప్రాముఖ్యత, విధులను వివరించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియాలో జరుగుతున్న సంఘటనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ రఘుపతి, సిబ్బంది శ్రీరాములు, శ్యామల, లావణ్య, మహేశ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు మౌనిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): ఢిల్లీలో జరగనున్న 67వ జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు మండల పరిధిలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని కూరాకుల మౌనిక ఎంపికైంది. బుధవారం హెచ్‌ఎం ఎలికట్టె ఐలయ్య మాట్లాడుతూ ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పాల్గొన్న మౌనిక ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 16 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఢిల్లీకి వెళ్లేందుకు రవాణా ఖర్చులకు ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ రూ.3 వేలు ఆర్థిక సహాయం అందించారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ చలపతి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 9 నుంచి 12 వరకు కామారెడ్డి జిల్లా ఉప్పల్‌వాయిలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి అందుకున్నారు. ప్రిన్సిపాల్ చలపతి విద్యార్థులను, పీడీ కృష్ణారెడ్డి, పీఈటీ అశోక్‌ను అభినందించారు.

అవినీతిపరులు జైలుకెళ్లడం ఖాయం

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి



కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ సర్కారు పడిపోవడం కాదు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపడం ఖాయమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తమ అక్రమాలు, భూకబ్జాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని అనుచిత వాఖ్యలు చేస్తున్నాడన్నారు. పల్లా వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణం కోసం చేసిన భూకబ్జా ఎక్కడ బయటపెడతారో అన్న భయంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో అక్రమార్కుల భరతం పడతారన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని కె.శ్రావణి ప్రథమ బహుమతి సాధించడంతో పాటు మరో ఐదుగురు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బుధవారం శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామచంద్రం చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు అభినందించారు.

వర్గీకరణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఎమ్మార్పీఎస్ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిద్దిపేటఅర్బన్: ఎస్సీ వర్గీకరణకు 29 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్, మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పి) జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సూచన మేరకు వచ్చే నెల రోజులపాటు ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈనెల 15వ తేదీన సిద్దిపేటలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించి కమిటీలు వేస్తామన్నారు. అలాగే 17 నుంచి మండల స్థాయిలో సదస్సులు ఏర్పాటు చేసి మండల కమిటీలు వేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ అసెంబ్లీ ఇన్‌చార్జి పెర్క పరశురాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ యాసంగి పంటలు నమోదు చేసుకోవాలి



హుస్నాబాద్‌రూరల్: రైతులు యాసంగి పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు అన్నారు. బుధవారం మహ్మదాపూర్ గ్రామంలోని పంటల వివరాలను ఏఈఓ ప్రణీత నమోదుచేస్తున్న తీరును పరిశీలించారు. రైతులు పంటల వివరాలను నమోదు చేసుకుంటే ధాన్యం మార్కెట్‌లో విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ సమ్మెలో ఉద్యోగులు.. నిలిచిన సేవలు

గజ్వేల్‌రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో తపాలా సేవలు నిలిచిపోయాయి. గ్రామీణ తపాల ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా సిద్దిపేట సబ్‌డివిజన్ పరిధిలోని గజ్వేల్‌లోని ఐటీసీ తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం ఉద్యోగులు మాట్లాడారు. 8 గంటలపనితోపాటు పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు.

◆ మట్టి నమూనాల సేకరణ

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని నరసాయిపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బంది భూసార పరీక్షల కోసం పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ మాట్లాడుతూ పొలాల నుంచి గ్రిడ్ పద్ధతిలో మట్టిని సేకరించి పరీక్షల కోసం భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతున్నామన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఏ పంటను సాగుచేయాలో రైతులకు తెలిపి ఎరువుల మోతాదు సిఫార్సు చేస్తామన్నారు. పంట మార్పిడికి తగిన మోతాదులో ఎరువులు వాడాలన్నారు.

◆ ఓటర్ జాబితాలో మార్పులకు అవకాశం

దుబ్బాక: 2024 జనవరి 1వ తేదీ వరకు ఓటర్ జాబితాలో మార్పులకు చేర్పులకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అవకాశం కల్పించిందని దుబ్బాక తహసీల్దార్ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఫార్మ్ 6, 7లను నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో తమ విధులను విజయవంతంగా నిర్వహించిన బీఎల్‌ఓలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆటోవాలాల ఆందోళన



మిరుదొడ్డిలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము జీవనోపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బెజ్జంకిలో ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయంలో ప్రయాణికులు ఆటోలు ఎక్కడంలేదన్నారు. కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధికి గొడ్డలి పెట్టు

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల ఉపాధికి గొడ్డలి పెట్టులా మారిందని మిరుదొడ్డి మండల ఆటో యూనియన్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మిరుదొడ్డిలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో ఉపాధి లేక తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో కొట్టుమిట్టాడుతూనే పిల్లల చదువులు, బ్యాంకు రుణాలు, ఈఎంఐలు కట్టలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై పునరాలోచించి ఉపాధి మార్గం చూపాలని వేడుకున్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



హెచ్‌ఎం జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం జగదీశ్వర్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జగదీశ్వర్‌ను సన్మానించి, కొత్తగా వచ్చిన హెచ్‌ఎం రాజేందర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు ఉపాధ్యాయులకు సహజమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, ఎంపీటీసీ ఉమారాణి బాలాగౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సింహులు, ఉపాధ్యాయులు సత్యకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులతో విశ్రాంత ఉపాధ్యాయుడు జగదీశ్వర్

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జగదీశ్వర్ మాట్లాడుతూ కోహెడ, బస్వాపూర్, కస్తూర్బా గాంధీ, నాగసముద్రాల మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ పాఠశాలలకు చెందిన 294 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిమబిందు, వెంకట చలపతి, నరేందర్‌రెడ్డి, మహమూద్ పాల్గొన్నారు.